

రూ.51,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి బల భద్ర రాయుడు కుటుంబం (రాజోలు) సోమ వారం రూ.51,116 విరాళం సమర్పించింది.



వేంకటేశ్వరునికి రూ.లక్ష

దేవరపల్లి: స్థానిక శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, సుబ్రహ్మణ్యం దంపతులు (గౌరీపట్నం) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
39.0°/26.3°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	37.0	27.0
కాకినాడ	37.0	26.3
అమలాపురం	39.0	27.0

న్యూస్‌రీల్

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



స్ట్రాంగ్ రూముల వద్ద అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వచ్చే నెల 4న చేపట్టబోయే ఓట్ల కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత సోమవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించేలా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచిన ఈవీఎంల భద్రతను, రక్షణ చర్యలను నిశితంగా పరిశీలించారు. రాజమండ్రి లోక్‌సభ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్లు పోలైన ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల నుంచి పటిష్టమైన భద్రతతో ఓట్ల లెక్కింపు కేంద్రాలకు తీసుకుని వచ్చేందుకు రూపొందించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. దీనిపై ఎస్పీ పి.జగదీష్‌తో కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎస్.తేజ్‌భరత్, కె.దినేష్‌కుమార్, అశుతోష్ శ్రీవాత్సవ్, ఎ.చైత్రవర్షిణి, అదనపు ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు ఎరువులు సిద్ధం

ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రతాప్



రాజమహేంద్రవరం రూరల్: ఖరీఫ్‌లో రైతులకు కావలసిన ఎరువులను అందుబాటులో ఉంచామని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ దేవారపు ప్రతాప్ తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులను సొసైటీలు, రైతుభరోసా కేంద్రాలకు (ఆర్‌బీకే) మార్క్‌ఫెడ్ ద్వారా పంపించామని చెప్పారు. సొసైటీలకు 624.600 మెట్రిక్ టన్నుల యూరియా, 12 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 21.5 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులను పంపించామని వివరించారు. ఆర్‌బీకేల్లో 32.4 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. అలాగే, మార్క్‌ఫెడ్ గోడౌన్లలో 3,213.090 మెట్రిక్ టన్నుల యూరియా, 188 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 111.30 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు నిల్వ ఉంచామని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులకు అవసరమైన ఎరువులను ఎప్పటికప్పుడు కొరత లేకుండా పూర్తి స్థాయిలో సరఫరా చేస్తామని ప్రతాప్ తెలిపారు.

అన్నదాత కన్నీరు తుడిచేలా..

- మిచాంగ్ తుపాను బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు
- ఇన్నాళ్లు రైతులకు అందకుండా చంద్రబాబు అండ్ కో కుట్రలు
- ఎన్నికల పేరుతో అన్నదాతకు సాయం చేయకుండా మోకాలడ్డు
- పోలింగ్ అనంతరం నిధులు జమ చేస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో పంట నష్టపోయిన 15,615 మంది
- రూ.14.80 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల



పెరవలి మండలం అన్నవరప్పాడులో మిచాంగ్ తుపానుకు నష్టపోయిన పంటను చూపుతున్న రైతు (ఫైల్)



పెరవలి మండలం ఖండవల్లిలో మిచాంగ్ తుపానుకు దెబ్బ తిన్న అరటి తోటను చూపుతున్న రైతు (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన అన్నదాతల కన్నీరు తుడిచే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. నెలల వ్యవధిలోనే పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించింది. ప్రకృతి వైపరీత్యాలతో ఒక సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు ఆ సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ అందించే నూతన విధానాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగానే మిచాంగ్ తుపాను నష్టపరిహారాన్ని కూడా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. సరిగ్గా అదే తరుణంలో చంద్రబాబు అండ్ కో సైంధవ పాత్ర పోషించారు. ఎన్నికల కోడ్ పేరుతో రైతులకు పరిహారం నిధులు విడుదల చేయకుండా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసి, అడ్డం పడ్డారు. ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో ఆ పరిహారాన్ని ప్రభుత్వం ఇప్పుడు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.

అప్పట్లోనే వేగంగా నష్టాల అంచనా

నాటి మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో వరి, పత్తి, వేరుశనగ, చెరకు, మొక్కజొన్న, మినుములు, పెసలు, సన్‌ఫ్లవర్, జొన్న, పొగాకు వంటి పంటలకు నష్టం వాటిల్లింది. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, వలంటీర్లు ఆగమేఘాల మీద క్షేత్ర స్థాయికి వెళ్లారు. అప్పట్లో ఖరీఫ్ కోతలు జరుగుతున్నందున రైతులు గింజ కూడా నష్టపోకుండా అండగా నిలిచారు. ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో ఈ ప్రక్రియ చేపట్టింది. ధాన్యంలో తేమ ఉన్నప్పటికీ మిల్లులకు తరలించింది. రైతులకు అన్ని సదుపాయాలూ కల్పించింది. రాత్రి వరకూ ఉండి మరీ ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియ చేపట్టింది. జిల్లాలో 8,799 మెట్రిక్ టన్నులు కొన్నారు. ముందస్తుగానే అప్రమత్తమై కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించారు.

అదే సమయంలో ఏ ఒక్క రైతూ నష్టపోకూడదనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికార యంత్రాంగం పంట నష్టాల జాబితాను పక్కాగా రూపొందించింది. నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేసి, ఆ జాబితాలను సంబంధిత గ్రామ/వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచింది. అభ్యంతరాలు స్వీకరించి అర్హుల తుది జాబితా రూపొందించి, ప్రభుత్వానికి నివేదించింది. దీని ప్రకారం మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా 15,615 మంది రైతులకు సంబంధించి 10,487.02 హెక్టార్లలో ఉద్యాన, వ్యవసాయ పంటలు దెబ్బ తిన్నాయని నిర్ధారించారు. ఈ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం ఇంకో ఆలోచన చేయకుండా రైతులకు అండగా నిలిచింది. నష్టపోయిన రైతులకు నెలల వ్యవధిలోనే రూ.14.80 కోట్ల పెట్టుబడి రాయితీ మంజూరు చేసింది. నిబంధనల మేరకు ఒక్కో పంటకు ఒక్కో విధంగా ఇన్‌పుట్ సబ్సిడీ నిర్ధారించారు.

రైతులపై చంద్రబాబు కుట్రలు

తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కనీస కనికరం చూపకపోగా.. మేలు చేయడానికి సిద్ధమైన ప్రభుత్వాన్ని సైతం అడ్డుకున్నారు. రైతులకు పెట్టుబడి రాయితీ అందకుండా కుట్రలు పన్నారు. ఎన్నికలను అడ్డం పెట్టుకుని పెట్టుబడి డబ్బులు మంజూరు చేయకూడదంటూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. దీంతో నిధుల విడుదలకు ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసింది. ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పంటల వారీగా హెక్టారుకు మంజూరు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.లు)

పంట	ఇన్‌పుట్ సబ్సిడీ
వరి, వేరుశనగ, పత్తి, చెరకు	17,000
మొక్కజొన్న	12,500
మినుము, పెసలు, శనగలు, పొద్దుతిరుగుడు, పొగాకు	10,000
జొన్న	8,500

నియోజకవర్గాల వారీగా ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు ఇలా..

నియోజకవర్గం	రైతులు	పంట నష్టం (హెక్టార్లు)	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.లక్షలు)
అనపర్తి	682	344.28	52.43235
రాజమండ్రి రూరల్	214	112.55	18.8077
రాజానగరం	8,554	6032.16	838.6905
జగ్గంపేట	1,484	832.05	141.4485
గోపాలపురం	2,970	2195.81	279.91535
కొవ్వూరు	819	534.9	77.28165
నిడదవోలు	892	435.27	71.9426

రూ.8 వేల పెట్టుబడి రాయితీ



చాగల్లు గ్రామంలో 1.97 ఎకరాల్లో మినుములు సాగు చేశాను. మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బ తింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పంట నష్టం అంచనా వేశారు. డబ్బులు కూడా పడతాయని చెప్పారు. కానీ ఎన్నికలున్నాయని డబ్బులు పడలేదు. ఇప్పుడు పోలింగ్ పూర్తవడంతో రూ.8 వేల పెట్టుబడి రాయితీ అందుకునే అవకాశం దక్కింది. పంట నష్టపోయిన వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. ఈ డబ్బులు కుటుంబ అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయి.

– మారిన చాముండేశ్వరి, చాగల్లు

పెట్టుబడి రాయితీ అడ్డుకోవడం దారుణం



తుపానుతో నష్టపోయిన రైతులకు సీఎం వైఎస్ జగన్ సాయం చేస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఓర్వలేకపోతున్నారు. చివరకు రైతులు నష్టపోయిన పంటలకు పెట్టుబడి రాయితీ డబ్బులు కూడా ఎన్నికల పేరుతో ఇవ్వనీయకుండా అడ్డుకోవడం దారుణం. బాబుకు రైతులే తగిన బుద్ధి చెబుతారు.

– గారపాటి శ్రీనివాసరావు, చాగల్లు

అర్హుల ఖాతాల్లో...



మిచాంగ్ తుపానుతో పంట నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. ఇప్పటికే జమ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. సింహభాగం రైతుల ఖాతాల్లో నగదు జమ అయింది. 33 శాతం కంటే ఎక్కువగా పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాం. ఎలాంటి అభ్యంతరాలున్నా స్వీకరించాం. అర్హుల జాబితా రూపొందించి ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తోంది.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి



సత్యదేవుడు, అమ్మవార్లకు అరుంధతీ నక్షత్ర దర్శనం చేయిస్తున్న పండితులు



రావణబ్రహ్మ వాహనంపై సత్యదేవుని ఊరేగింపులో చైర్మన్ ఐవీ రోహిత్



ఆకట్టుకున్న జానపద కళారూపాలు

అన్నవరంలో నేడు

తెల్లవారుజామున 3.00 : సుప్రభాత సేవ.
ఉదయం 8.00 : చతుర్వేద పారాయణ.
మధ్యాహ్నం 2.30 : అనివేటి మండపంలో సత్యదేవుడు, అమ్మవారి సమక్షంలో సరస్వతీ పూజ. వేద పండిత సదస్యం, పండిత సత్కారం.
రాత్రి 9.00 : కొండ దిగువన పొన్నచెట్టు వాహనంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు.
ఉదయం 7.00 – 10.00, సాయంత్రం 5.00 – రాత్రి 11.00 : రత్నగిరి కళావేదిక మీద, కొండ దిగువన సాంస్కృతిక కార్యక్రమాలు.

వైభవంగా సత్యదేవుని కల్యాణోత్సవాలు

- వేడుకగా అరుంధతీ నక్షత్ర దర్శనం
- రావణబ్రహ్మ వాహనంపై ఊరేగింపు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం సాయంత్రం నవదంపతులు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు దర్బారు మండపంలో స్థాలీపాక హోమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను తూర్పు రాజగోపురం ముందున్న ఆవరణలోకి ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు పండితులు అరుంధతీ నక్షత్రాన్ని చూపించి, పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమంద్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వర శర్మ, వైదిక కమిటీ సభ్యుడు చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ఊరేగింపు

సత్యదేవుడు, అమ్మవారిని రావణబ్రహ్మ వాహనం మీద ఘనంగా ఊరేగించారు. రాత్రి తొమ్మిది గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కొండ దిగువన ఉన్న తొలి పావంచా వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ సర్వాంగసుందరంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై స్వామి, అమ్మవార్లను వేంచేయించి, పండితులు పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పూజలు చేశారు. అనంతరం రావణబ్రహ్మ వాహనం ముందు కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. రత్నగిరి తొలి పావంచా వద్ద నుంచి ఆంధ్రా బ్యాంక్ సెంటర్ వరకూ.. అక్కడి నుంచి తిరిగి తొలి పావంచా వరకూ ఈ ఊరేగింపు కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, ఇతర కళారూపాలు అధిక సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులను, భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ఊరేగింపును పురస్కరించుకుని గ్రామంలోకి భారీ వాహనాలను అనుమతించలేదు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపు సాగినంతసేపూ బాణసంచా కాల్చారు.



రావణబ్రహ్మ వాహనంపై సత్యదేవుని ఊరేగింపునకు తరలివచ్చిన భక్తులు



రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీరిన స్వామి, అమ్మవారు

అసాంఘిక శక్తులపై

ఉక్కుపాదం

- జిల్లాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్
- కౌంటింగ్ పూర్తయ్యే వరకూ నిర్వహణ



కార్డన్ అండ్ సెర్చ్‌కు సిద్ధమవుతున్న జిల్లా పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో అసాంఘిక శక్తులను అణచివేసే దిశగా పోలీసు యంత్రాంగం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి ఈ ఆపరేషన్ ప్రారంభించారు. వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైల ఆధ్వర్యాన పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది సంయుక్త బృందాలుగా ఏర్పడ్డారు. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశమున్న ప్రాంతాలను ముందుగా ఎంచుకుని, ఒకేసారి అధిక సంఖ్యలో దాడులు చేస్తున్నారు. అణువణువూ సోదా చేసి మద్యం, మందుగుండు సామగ్రి, ఆయుధాల అక్రమ నిల్వలతో పాటు అనుమానితులను ఆరా తీస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ ప్రతి రోజూ ఈ ఆపరేషన్ నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. కాగా, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ విడిగా బాటిల్స్‌లో పోసి, అమ్మడాన్ని నిషేధించారు. దీనిపై బంకు యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చారు.

66 వాహనాలు స్వాధీనం



జిల్లా అంతటా కార్డన్ అండ్ సెర్చ్ ప్రారంభించాం. ఆదివారం నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో రూ.10,950 విలువైన మందుగుండు సామగ్రి, రికార్డులు లేని 66 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. బాణసంచా తయారీ, నిల్వ ఉంచే గోడౌన్లలో సంబంధిత పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ పాటించాల్సిన నిబంధనలను బాణసంచా తయారీ, నిల్వ ఉంచే గోడౌన్ల యజమానులకు వివరించారు.

– పి.జగదీష్, జిల్లా ఎస్పీ, రాజమహేంద్రవరం

ఓట్ల లెక్కింపులో టేక్ కేర్

- కౌంటింగ్ కేంద్రంలో మొబైల్ ఫోన్లకు 'నో'
- సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా
- నన్నయ వర్సిటీ ఆవరణలోకి వాహనాలకూ అనుమతి లేదు
- తక్షణ సమాచారం ఇచ్చేలా ముందస్తు ఏర్పాట్లు
- ఆర్‌ఓల శిక్షణలో కలెక్టర్ మాధవీలత



ఆర్‌ఓల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): వచ్చే నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు(ఆర్‌ఓ), ఇతర సిబ్బందికి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని, చట్టపరమైన నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

- ఉదయం 5 గంటల నుంచే ఓట్ల లెక్కింపునకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- కౌంటింగ్ సిబ్బందిని తప్ప ఇతరులెవ్వరినీ ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతంలోకి అనుమతించరాదు.
- ఓట్ల లెక్కింపు జరిగే రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆవరణలోకి ఎటువంటి వాహనాలకూ అనుమతి లేదు. ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద నాలుగు ఏసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నాం.
- కౌంటింగ్ కేంద్రాల్లోనికి ఆర్‌ఓలు తప్ప ఇతరుల మొబైల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదు. దీనిపై సంబంధిత ఆర్‌ఓలు కచ్చితంగా తనిఖీలు నిర్వహించాలి. మొబైల్ ఫోన్‌ల డిపాజిట్‌కు కౌంటర్ ఏర్పాటు చేయాలి.
- మీడియా సెంటర్ వరకూ మొబైల్ ఫోన్‌లను అనుమతించవచ్చు.
- ఆర్‌ఓలు తమ మొబైల్ ఫోన్ ద్వారా రౌండ్ల వారీ సమాచారం ఇవ్వాలి. ఆర్‌ఓలు డెజిగ్నేటెడ్ అధికారిని నియమించుకుని, వారి ద్వారా మీడియా విభాగానికి కూడా సమాచారం అందజేయాలి.
- కమ్యూనికేషన్ విభాగంలోని అధికారులకు, సిబ్బందికి సిట్టింగ్ ఏర్పాట్లు ఉండాలి. ఎస్‌టీడీ, ఫ్యాక్స్, ప్రింటర్, ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులో ఉంచుకోవాలి. ప్రధాన ఎన్నికల అధికారికి తక్షణ సమాచారం అందించేందుకు హైస్పీడ్ ఇంటర్‌నెట్ కనెక్షన్ కలిగిన కంప్యూటర్‌తో పాటు ఒక హాట్‌లైన్ ఏర్పాటు చేసుకోవాలి. వీటి పర్యవేక్షణకు సీనియర్ అధికారిని నియమించాలి.
- పరిశీలకుల గదిలో కూడా ఫోన్, ఫ్యాక్స్, ఇంటర్‌నెట్, టీవీ, ప్రొటోకాల్ బృందం, సిబ్బందిని అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.
- ప్రతి టేబుల్ వద్ద స్టేషనరీ, ఇన్ఫర్మేషన్ షీట్లు, అదనపు సిబ్బందికి ఏర్పాట్లు ఉండాలి.

14 మంది ఏజెంట్లకు మాత్రమే అనుమతి

- కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి, టేబుల్ కేటాయింపునకు చర్యలు తీసుకోవాలి.
- ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో గరిష్టంగా 14 మంది ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తారు.
- ఫామ్–17సిలో నమోదు చేసిన ఓట్లను ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల సంఖ్యతో సరిచూస్తారు. ఆ సంఖ్యను కౌంటింగ్ సిబ్బంది ఫామ్–17సి పార్ట్–2లో నోట్ చేసుకుని, ఏజెంట్ల సంతకం తీసుకుంటారు.
- అనంతరం ఈవీఎంల సీల్ తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారు. ఆ ఈవీఎంలో పోలైన ఓట్లలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే విషయం తెలుస్తుంది.
- ఆ వివరాలను కౌంటింగ్ సిబ్బంది నోట్ చేసి, ఆ సంఖ్యను ఏజెంట్లందరికీ చూపించి, వారు సంతృప్తి వ్యక్తం చేశాకే రౌండ్ ఫలితాలను వెల్లడించాలి.
- ఒక్కో రౌండులో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డుపై సిబ్బంది రాస్తారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో తీసి భద్రపరుస్తారు.

భద్రత కట్టుదిట్టం

- ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలి.
- ఈవీఎంల రవాణాకు బారికేడ్‌లు ఏర్పాటు చేసుకోవాలి.
- పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఎలక్షన్ ఏజెంట్లను లెక్కింపు కేంద్రంలోనికి అనుమతిస్తారు.
- మూడంచెల భద్రతలో భాగంగా మొదటిగా 100 మీటర్ల పాదచారుల జోన్ ఏర్పాటు చేయాలి. ఇందులో సంబంధిత వ్యక్తి గుర్తింపు కార్డును సీనియర్ మెజిస్ట్రేట్ పరిశీలించి అనుమతిస్తారు.
- రెండో అంచెలో ఆయా వ్యక్తులను రాష్ట్ర సాయుధ పోలీసులు పూర్తి స్థాయిలో తనిఖీ చేస్తారు. ఎటువంటి అనుమానాస్పద వస్తువులూ లేవని నిర్ధారించుకున్న తరువాత విడిచిపెడతారు. ఇక్కడ మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. మొబైల్ ఫోన్‌లు లేవని నిర్ధారించుకోవాలి.
- మూడో అంచెలో కేంద్ర సాయుధ బలగాలు తనిఖీ చేస్తాయి.
- కౌంటింగ్ హాలు లోపలకు కెమెరా స్టాండ్‌ను అనుమతించరు. చేతి కెమెరాకు మాత్రమే అనుమతి ఉంటుంది.
- శాంతిభద్రతల విషయంలో కచ్చితత్వం పాటించాలి.
- ఓట్ల లెక్కింపు నుంచి ఎన్నికల ఫలితాల వెల్లడి వరకూ మొత్తం బాధ్యత రిటర్నింగ్ అధికారిపైనే ఉంటుంది.
- ఈ శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, రాజమండ్రి రూరల్ ఆర్‌ఓ ఎస్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్, రాజమండ్రి సిటీ ఆర్‌ఓ కె.దినేష్ కుమార్‌తో పాటు ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా

23న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ: ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు కాకినాడ జిల్లా పరిషత్‌లోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలన్నారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్టు సీఈవో శ్రీరామమూర్తి తెలిపారు.

ఆ ఊరిగాయల రుచే వేరు!

- పచ్చళ్ల తయారీలో ఆ గ్రామాలు అదుర్స్
- విదేశాలకు సైతం ఎగుమతి
- పలు కుటుంబాలకు జీవనోపాధి



ఆవకాయ కోసం తయారైన మామిడిముక్కలు



పచ్చళ్ల కోసం తయారైన మామిడిముక్కలు



తయారైన ఆవకాయ

ఆత్రేయపురం: ఒక్కొక్క వంటకానికి ఒక్కొక్క ఊరు ప్రసిద్ధి. కానీ ఊరగాయల తయారీకి మాత్రం ఆ గ్రామాలే పెట్టింది పేరు. అక్కడ నుంచి ఊరగాయలు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతాయి. ఆ గ్రామాల వారు పచ్చళ్ల తయారీతో జీవనోపాధి పొందడంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఆహా ఏమి రుచి తినరా మైమరచి అన్నట్టు... తినేవారికి నోరూరించే పచ్చళ్ల తయారీకి ఆత్రేయపురం మండలం ప్రసిద్ధి చెందింది. ఆవకాయకు ఆంధ్రా పెట్టింది పేరు కాగా కోనసీమలోని ఆత్రేయపురం, నార్కెడిమిల్లి, అంకంపాలెం, ఉచ్చిలి, ర్యాలి గ్రామాలు పచ్చళ్ల తయారీకి ప్రసిద్ధి చెందాయి. ఆవకాయ పచ్చడి తయారీలో ఈ గ్రామాల వారు మామిడికాయలకు కారం, నూనె, ఆవపిండి, ఉప్పు, వెల్లుల్లి, మెంతులు తదితర మసాలా దినుసులతో పాటు, ఆప్యాయతలు రంగరించి సొంత వాడకానికి చేసినట్టుగా పచ్చళ్లు తయారు చేస్తుంటారు. దీంతో వీటి ముందు కార్పొరేట్ కంపెనీల పచ్చళ్లు సైతం దిగదుడుపే అవుతాయి.

కుటీర పరిశ్రమగా..

ఆత్రేయపురం మండలంలో నార్కెడిమిల్లి, ఆత్రేయపురం, అంకంపాలెం, ఉచ్చిలి, ర్యాలి గ్రామాల్లో సుమారు 15 వేలకు పైగా జనాభా ఉండగా 20 శాతం మంది పచ్చళ్ల తయారీనే కుటీర పరిశ్రమగా ఎంచుకుని జీవనోపాధి పొందుతున్నారు. సుమారు వెయ్యి కుటుంబాల వారు వేసవిలో పచ్చడి తయారు చేసి ఏడాది పొడవునా అమ్మకాలు సాగిస్తుంటారు. దీంతో పాటు సీజన్‌ల వారిగా ఏడాది పొడవునా వివిధ రకాల పచ్చళ్లు తయారు చేస్తుంటారు. ఆవకాయ, తీపి ఊరగాయ, మాగాయ, టమాటా, అల్లం, ఎండు మిరపకాయ, చింతకాయ, ఉసిరి, గొంగూర, నిమ్మకాయ, కాలీఫ్లవర్, ములక్కాడ పచ్చళ్ళను ఆయా సీజన్‌లను బట్టి తయారు చేస్తుంటారు. ఎంచుకున్న కూరగాయలతో పాటు తగినంత ఉప్పు, కారం, వెల్లుల్లి, పోపులు, నూనె వంటి దినుసులు వేసి వీరి చేతులతో కలిపితే ఆ రుచులే వేరు. మహిళలు తయారు చేసిన పచ్చళ్లను కుటుంబంలోని పురుషులు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. కడప, పులివెందుల, విశాఖపట్నం, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఈ పచ్చళ్ళకు మంచి పేరుంది. విదేశీ గడ్డపై కూడా ఈ పచ్చళ్లు నోరూరిస్తూ ఆంధ్రా సత్తా చాటుకున్నాయి. నార్కెడిమిల్లిలో సుమారు 170 డ్వాక్రా సంఘాలు పావలా వడ్డీ రుణాలతో పచ్చళ్లు తయారు చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు.

పెరిగిన ధరలతో తయారీ భారం

ఆవకాయ తయారు చేసేందుకు ఉపయోగించే మామిడికాయలు, ఇతర దినుసుల ధరలు పెరగడంతో పచ్చళ్ల తయారీ పెనుభారమౌతోందని ఈ పరిశ్రమపై ఆధారపడిన వారు అంటున్నారు. మామిడికాయ టన్ను ఒక్కంటికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు చెల్లిస్తుండగా ఎండుమిర్చి క్వింటాల్ రూ.18 వేల నుంచి రూ.20 వేలు, క్వింటాల్ ఉప్పు బస్తా రూ.400, 20 లీటర్ల నూనె డబ్బా రూ.3,500, ఆవాల బస్తా రూ.700, మెంతులు బస్తా రూ.900, వెల్లుల్లి క్వింటాల్‌కు రూ.15వేలు పలుకుతుందని చెబుతున్నారు. దీనికితోడు కూలీ ధరలు విపరీతంగా పెరగడంతో టన్ను మామిడికాయలతో తయారు చేసిన పచ్చడికి సుమారు రూ.65 వేలు ఖర్చు అవుతోంది. ఈ గ్రామాల వారు ఇంటి వద్ద కేజీ పచ్చడి రూ.225 నుంచి రూ.300కి విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వీరి వద్ద నుంచి కొనుగోలు చేసిన చిరు వ్యాపారాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల్లో విక్రయించి జీవనోపాధి పొందుతారు. సీజన్ వారీగా పచ్చళ్లను తయారు చేసి ఏడాది పొడవునా దాన్ని భద్రపరచి అమ్మకాలు సాగిస్తుంటారు. అందుకు గాను వేసవిలో తమకున్న పరపతినంతా ఉపయోగించి మూడు వేల కుటుంబాల వారు ప్రైవేటు వ్యక్తుల వద్ద, బ్యాంకుల వద్ద రుణాలు తెచ్చి పచ్చళ్లు తయారు చేస్తారు. సగటున ఒక్కొక్క కుటుంబం వారు పది టన్నుల మామిడికాయలు దిగుమతి చేసుకుంటారు. అందుకే వేసవిలో ఈ గ్రామాల్లో ఏ ఇంట చూసినా మామిడిరాశులు కనుల విందు చేస్తాయి. మూడు వేల కుటుంబాల వారు సుమారు 30 వేల టన్నుల వరకు మామిడికాయలను దిగుమతి చేసుకుంటారు.

పచ్చళ్ల తయారీతో ఉపాధి



పచ్చడి తయారీతో జీవనోపాధి పొందడంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నాను. గత 30 ఏళ్లుగా పచ్చడి తయారీలో అనుభవం ఉంది. – సుంకర బ్రహ్మానందం, అంకంపాలెం

వేసవిలో తయారు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తాను



ఏటా వేసవిలో పెట్టుబడులు పెట్టి పచ్చళ్లు తయారు చేస్తాను. ఆ పచ్చళ్లను హైదరాబాద్, వైజాగ్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తూ పలువురి ఉపాధికి తోడ్పడుతున్నాను.
– అద్దాల రమేష్, ఆత్రేయపురం

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు నుంచి జారిపడి మృతి చెందిన వ్యక్తి

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి (60) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడడంతో తల, కాళ్లకు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నీలంరంగు ప్యాంటు, గులాబీ రంగు ఫుల్ చేతుల చొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడియం: మండలంలోని కడియం–ద్వారపూడి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే పట్టాలపై సుమారు 40 సంవత్సరాల వయసు గల పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. తెలుపు రంగుపై నలుపు రంగు డిజైన్‌ల ఫుల్‌హాండ్స్ చొక్కా, సిమెంటు రంగుపై తెలుపురంగు డిజైన్ గల షార్ట్ ధరించి ఉన్నాడన్నారు. అతడి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వివరించారు. ఇతడి ఆచూకీ తెలిసినవారు 94914 44022 నంబర్‌లో రైల్వే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

సెంట్రల్ జైలుకు బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డు



బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డుకు ఎంపికైన సెంట్రల్ జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డు –2024 వరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఈ అవార్డును ఈ నెల 22న అంతర్జాతీయ జైవైవిధ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అందజేయనున్నారు. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ సోమవారం ఆ వివరాలను వెల్లడించారు. సెంట్రల్ జైలులో పర్యావరణ సమతుల్యతకు వివిధ రకమైన మొక్కలు, వృక్షజాతులు, పక్షులను పెంచుతున్నట్టు పేర్కొన్నారు. పురాతన కట్టడాలు, సంస్కృతి పరిరక్షణ, సోలార్ వంటి సహజ వనరుల వినియోగం, నీటి వనరుల సంరక్షణ, తోటలకు సేంద్రియ ఎరువుల వాడకం, పర్యావరణ కాలుష్యం లేకుండా కుండల్లో మంచినీరు, ఖద్దరు దుస్తుల తయారీ, కొబ్బరి నారతో తాళ్లు, ఫ్లోర్ మ్యాట్స్, సంప్రదాయ పద్ధతులు పాటించడం వంటివి గుర్తించి ఈ అవార్డును ప్రకటించినట్టు ఆయన తెలిపారు.

ఉపాధి కూలీకి పాముకాటు

కడియం: మండల కేంద్రమైన కడియం పంచాయతీ పరిధిలో ఉపాధి పనుల్లో నిమగ్నమై ఉన్న నీలగిరి సత్యనారాయణను సోమవారం పాము కరిచింది. విషయాన్ని గమనించి అతడిని వెంటనే కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆసుపత్రిలో సత్యనారాయణను పరామర్శించి, అతడి ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వాసుపత్రి వైద్యుడు శివశంకర్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌మనోజ్ మాట్లాడుతూ సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారన్నారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచారని వివరించారు.

బాణసంచా పట్టివేత

గోపాలపురం: మండలంలోని కరిచర్లగూడెంలో అనధికారికంగా నిల్వ ఉంచిన బాణసంచాను పట్టుకున్నట్లు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కరిచర్లగూడెం గ్రామానికి చెందిన షేక్ దాదా సాహెబ్ అనధికారికంగా బాణసంచా నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా అతని వద్ద నుంచి సుమారు రూ.10వేల విలువైన బాణసంచా సామగ్రిని పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

తాడిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



లక్ష్మణరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కొత్తపల్లి: తాడిచెట్టుపై కల్లు గీసేందుకు ఎక్కిన కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం కొమరగిరిలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన కల్లుగీత కార్మికుడు శీలం లక్ష్మణరావు (53) సోమవారం ఉదయం కల్లు గీసేందుకు తాడిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు తాడిచెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. అతని కూలిపని ఆధారంగా బతికే ఆ కుటుంబ సభ్యులు లక్ష్మణరావు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



లక్ష్మణరావు (ఫైల్)

వరుణుడు, సూర్యునికి బూరెల నివేదన



బూరెలను ఆకాశం వైపు ఎగురవేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు. చిత్రంలో ఈఓ రామచంద్రమోహన్, వేద పండితులు

- వర్షం ఆటంకం లేకుండా సత్యదేవుని కల్యాణం జరిగినందుకు కృతజ్ఞతలు
- ఆకాశం వైపు బూరెలు ఎగురవేసిన దేవదాయశాఖ కమిషనర్ దంపతులు

అన్నవరం: వర్షం కురవకుండా రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్యకల్యాణం ఆదివారం రాత్రి నిర్విఘ్నంగా జరగడంపై వరుణ దేవునికి, సూర్యభగవానుడికి కృతజ్ఞతలు తెలియచేస్తూ దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దంపతులు సోమవారం ఉదయం బూరెలు నివేదించారు. కమిషనర్ దంపతులు సోమవారం ఉదయం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఆలయంలోని దిగువన గల యంత్రాలయంలో గల సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పు రాజగోపురం వద్దకు వచ్చి సూర్యభగవానుడు, వరుణదేవునికి బూర్లు నివేదించి ఆకాశం వైపు గాలిలో ఎగురవేశారు. వాటిని భక్తులు ఏరుకుని ప్రసాదంగా స్వీకరించారు. ఆదివారం సాయంత్రం వర్షం కురియడంతో సత్యదేవుని కల్యాణ మహోత్సవానికి ఎక్కడ ఆటంకం ఏర్పడుతుందో అని అందరూ ఆందోళన చెందారు. రాత్రి ఏడు గంటలకు కూడా ఆకాశంలో దట్టమైన మేఘాలతో కూడిన వాతావరణం ఉండడంతో గ్రామంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు రద్దు చేశారు. అయితే రాత్రి కల్యాణ సమయంలో వర్షం కురవకపోవడంతో స్వామివారి కల్యాణం నిర్విఘ్నంగా వార్షిక కల్యాణ వేదిక మీద ఘనంగా నిర్వహించారు. మిగిలిన ఐదు రోజులు కూడా కరుణించాలని సోమవారం సూర్యభగవానుడిని వేడుకున్నారు. దేవస్థానం ఈఓ కె రామచంద్రమోహన్ , పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చోరీకి గురైన 281 ఫోన్లు బాధితులకు అందజేత



పోగొట్టుకున్న సెల్‌ఫోను బాధితురాలికి అందజేస్తున్న ఎస్పీ జగదీష్

ఇప్పటి వరకు రూ.2.52 కోట్ల విలువైన ఫోన్లు అందించిన పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో చోరీకి గురైన, పోగొట్టుకున్న 281 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఎస్పీ పి.జగదీష్ సోమవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ పొగొట్టుకున్న ఫోన్లను చాట్‌బోట్ ద్వారా ఒక వాట్సాప్ మెసేజ్‌తో రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నామని, ఇప్పటి వరకు ఆ విధంగా రూ.2.52 కోట్ల విలువైన 1,393 ఫోన్లు బాధితులకు అందజేశామన్నారు. ఫోన్ చోరీకి గురైన వారు చాట్ బోట్ సేవలను సేవలను వినియోగించుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు ఎవరికైనా దొరికితే వాటిని సొంతానికి వాడుకోవడం, గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా బిల్లులు లేని సెల్‌ఫోన్లలను కొనడం చేయరాదన్నారు. దొరికిన సెల్ ఫోన్లలను దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి అందజేయాలన్నారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లు ఇతర రాష్ట్రాలైన కేరళ, కర్నాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి రికవరీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఫోన్లు రికవరీ చేసిన అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలు, ఐటీ కోర్ టీం ఎస్సై అయ్యప్పరెడ్డి, కానిస్టేబుల్స్ కిరణ్, గౌతమ్, ప్రియాంక, గౌతమీ, శ్యామల, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పేద కార్మికునికి పెద్ద కష్టం

- కాలేయ, క్లోమ వ్యాధులతో పోరాటం
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు



విజయ్‌కుమార్ వైద్యం కోసం ఆవేదన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు



కాలేయ, క్లోమ వ్యాధులతో బాధపడుతున్న విజయ్‌కుమార్

తాళ్లరేవు: రెక్కాడితేగాని డొక్కాడని పేద కార్మికునికి పెద్ద కష్టం వచ్చి పడింది. ఒక్కగానొక్క కొడుక్కి అనుకోకుండా వచ్చిన అనారోగ్యంతో ఆ కుటుంబం అల్లాడిపోతుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన తాళ్లరేవు పంచాయతీ రచ్చవారిపేటకు చెందిన 26 ఏళ్ల రచ్చ విజయకుమార్ పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాది క్రితమే దీపిక అనే యువతితో అతనికి వివాహం జరిగింది. ప్రస్తుతం భార్య గర్భవతి. ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబంలో అనుకోని అనారోగ్య సమస్య ఇబ్బందులకు గురి చేసింది.

రెండు నెలల క్రితం విజయకుమార్‌కు పెయింటింగ్ పనిచేస్తున్న సమయంలో కడుపులో తీవ్ర నొప్పి రావడంతో తాళ్లరేవు ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అక్కడ మూడు రోజుల చికిత్స అనంతరం కాకినాడలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్య ఖర్చులు తట్టుకోలేక ప్రస్తుతం అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. అయితే అప్పటికే ఆరోగ్యశ్రీ కోటా అయిపోయిందని ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో ఆ పేద కుటుంబం స్తోమతకు మించి అప్పు చేసి వైద్యానికి ఖర్చు పెట్టారు. తమకున్న ఇల్లు కూడా తాకట్టు పెట్టి వైద్యం చేయిస్తున్నారు. గ్రామస్తులు తమకు తోచిన సాయం చేసినా ఏ మాత్రం సరిపోవడంలేదని విజయ్‌కుమార్ తల్లిదండ్రులు రచ్చ సూర్యనారాయణ, కామేశ్వరి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయ్‌కుమార్ తండ్రి మత్స్యకారుడైనప్పటికీ వృద్ధాప్యంతో ఏ పని చేయలేకపోతున్నాడు. నలుగురు కుమార్తెల అనంతరం పుట్టిన కుమారుడు విజయ్‌కుమార్‌ను కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. తన ఇంటితో పాటు కుమార్తె ఇల్లు తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చి వైద్యానికి ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇంకా ఆపరేషన్, ఇతర ఖర్చుల కోసం సుమారు రూ.3 లక్షల వరకూ అవసరం అవుతుందని, దాతలు సహాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. సహాయం చేసేవారు 97045 55308 నంబరులో సంప్రదించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.